క్లుప్తంగా

ఘనంగా శోభాయాత్ర



అయిజ: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం పర్దిపురంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో శోభాయాత్ర సాగింది. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు గ్రామ సమీపంలో నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే నెట్టెంపాడు కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుపై కూలిపోయిన రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

శివపార్వతుల విగ్రహస్థాపనకు భూమిపూజ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్‌కు భక్తులు వెళ్లే మార్గమధ్యంలో భైరాపురం, బూడిదపాడు చౌరస్తాలలో శివపార్వతులు, నందీశ్వరుడి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం భైరాపురం చౌరస్తా సర్కిల్‌లో 10వ తేదీన భూమిపూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో వాటిని ఏర్పాటు చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. దేవస్థానంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా విగ్రహాల ఏర్పాటుకు భక్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఇందుకోసం సంబంధిత జిల్లా అధికార యంత్రాంగం సైతం పూర్తి సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చౌరస్తాతో పాటు అలంపూర్ మాంటిస్సోరి స్కూల్ దగ్గర అతి త్వరలోనే సుందరమైన ఆర్చిగేట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం



గద్వాల అర్బన్: నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ధరల పెరుగుదలతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లాభాలు కట్టబెడుతూ పేదలపై ధరల భారం మోపుతుందన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగలక్ష్మి, శారద, లక్ష్మీదేవి, భారతి, రేవతి ఉన్నారు.

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



గద్వాల రూరల్: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీల నాయకులు శనివారం హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిజ్వారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ భీమన్న, మాజీ ఉప సర్పంచ్ దేవన్న, ఆశన్నలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్యల ఆధ్వర్యంలో చేరారు.

గద్వాల అర్బన్: ధరూర్ మండలంలోని ద్యాగదొడ్డికి చెందిన పలువురు శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, రాఘవేంద్ర రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్..

అయిజ: కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లోని ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లేందుకు సిద్ధమైన కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా జనరల్ సెక్రటరీ సాంబశివుడు, దేవేంద్ర ఉన్నారు.

బీటీరోడ్లకు మరమ్మతులెప్పుడో?

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎల్కూర్ - మల్దకల్ గ్రామాల మధ్య గుంతలు పడిన బీటీరోడ్డు

మల్దకల్: మండలంలోని గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మల్దకల్– మద్దెలబండ, సద్దలోనిపల్లి – నేతువానిపల్లి, తాటికుంట – తప్పెట్లమొర్సు– ఎల్కూరు– మల్దకల్, నాగర్‌దొడ్డి స్టేజీ – తూంకుంట గ్రామాల మధ్య బీటీ రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ రహదారులపై భారీ వాహనాల రాకపోకలు, వర్షాలకు రోడ్లు అక్కడక్కడ దెబ్బతినడంతో గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళల్లో వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ విషయమై ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇటీవల రోడ్డుకు అటు ఇటు పొలాల రైతులు రోడ్డును అడ్డంగా తవ్వి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకోవడంతో మరింత గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లను తవ్విన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇష్టానుసారంగా రోడ్లను తవ్వేస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు తాత్కాలికంగా అక్కడక్కడ మట్టి వేసి చేతులు దులుపేకుంటున్నారు. రోడ్లపై ఉన్న మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి, మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుకు పనులు చేపట్టాలి



సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించి వాహనదారులను కాపాడాలి.

– వెంకటేష్, సద్దలోనిపల్లి

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాల బీటీ రహదారులపై మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై గుంతలు కనిపించక, సూచికబోర్డులు లేని నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు అవుతున్నాయి. అధికారులు సూచికబోర్డులను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– రాముడు, నాగర్‌దొడ్డి

నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటాం



మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై గుంతలు ఏర్పడిన విషయాన్ని ఇప్పటికే పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాం. మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో కొంత ఆలస్యమవుతోంది. నిధులు వచ్చిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపడతాం.

– భరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, మల్దకల్

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు ఫారం అందజేస్తున్న మాదన్న



అలంపూర్ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న కావేరి

అయిజ: అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కోసం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం అయిజ పట్టణానికి చెందిన మాదన్న దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలో బీజేపీ టికెట్ కోసం బీజేవైఎం స్టేట్ ఆఫీస్ సెక్రటరీ రాజశేఖర్‌శర్మ భార్య కావేరిని దరఖాస్తు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, లాలు, నాగరాజు, ప్రశాంత్, మల్లేశ్, పాల్గొన్నారు.

అలంపూర్: అలంపూర్ అసెంబ్లీ స్థానానికి బీజేపీ టికెట్ కోసం బీజేపీ జిల్లా కార్యదర్శి రవికుమార్ శనివారం దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డికి దరఖాస్తు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ బాల్‌రెడ్డి, హైదరాబాదు జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి స్వరూపరాణి, నాయకులు వినోద్, సంపత్, సంతోష్ కుమార్, బాబు, నరేష్, సుధాకర్, రాజు ఉన్నారు.

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా బంగి లక్ష్మన్న శనివారం దరఖాస్తు చేశారు. రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల ఇన్‌చార్జ్ మల్లేషం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా సమక్షంలో దరఖాస్తు అందజేశారు. ఆయన వెంట బంగి జయలక్ష్మి, స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ మాదన్న, నాయకులు సూర్యప్రకాష్, రాజశేఖర్‌శర్మ, మురళీధర్, శ్రీనివాస్‌గౌడ్, జంగిటి శ్రీను, శేఖర్, గోపాల్‌కృష్ణ ఉన్నారు.

ఇంటింటా మట్టి సేకరణ



శింగవరంలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రరెడ్డి



ఇటిక్యాలపాడులో మట్టి సేకరణలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని శింగవరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రరెడ్డి ఆధ్వర్యంలో మట్టి సేకరణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 28 వరకు చేపట్టిన ఆజాదికా అమృత్ మహోత్సవ ముగింపులో భాగంగా 'నా భూమి నాదేశం' కార్యక్రమంలో ఇంటింటికి పిడికెడు మట్టి సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ మట్టితో ఢిల్లీ కేంద్రంలో అమృత వాటికలో 75వేల మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, నాయకులు నాగ మల్లయ్య, ఈశ్వర్, మధురవాణి, రంగస్వామి, నరేష్, శ్రీధర్, మాబు, సుబాని పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులో బీజేపీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గీతామాదురి ఇంటింటికి తిరిగి మట్టి సేకరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, వెంకటేష్, నాగమల్లయ్య, రంగస్వామి, నరేష్ పాల్గొన్నారు.

గురుకులంలో కాళోజీ జయంతి



పుల్లూరు గురుకులంలో కాళోజీ జయంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో తెలంగాణ మాండలిక భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణశోభితం హేమలాపురం నిలయం

హేమలాపురంగా పిలవబడే అలంపూర్ శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం శ్రావణ శనివారం ప్రదోశకాల వేల స్వర్ణశోభితమైంది. సూర్యాస్తమయం సమయంలో బంగారు వర్ణ కాంతులతో పాటు సప్తవర్ణాల కాంతులీలుతూ జోగుళాంబ ఆలయాలు భక్తులను కనువిందు చేసింది.

– జోగుళాంబ శక్తిపీఠం

పేద విద్యార్థికి చేయూత



గద్వాల అర్బన్: చదువుకోవాలనే ఆశయంతో ఉన్న పెద విద్యార్థికి చేయూత లభించింది. గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్‌కు చెందిన నితిన్‌రెడ్డి చార్టెడ్ అకౌంట్ అర్హత కోర్సు చదువుకునేందుకు ఎంట్రెన్ టెస్టులో సీటు సాధించాడు. ఈ కోర్సు చదువుకునేందుకు ఆర్థికస్థోమత లేకపోవడంతో పార్చర్ల సురేందర్‌రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవా సమితి కార్యాలయములో నితిన్‌రెడ్డికి రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పార్చర్ల సురేందర్‌రెడ్డిని రెడ్డి సేవా సమితి నాయకులు అభినందించారు.

మైనార్టీలకు అన్యాయం



గద్వాల అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని జిల్లా ముస్లిం మైనార్టీ అఖిలపక్ష నాయకులు అతిఖుర్ రహ్మాన్, హలీం పాష, ఆసీఫ్‌లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ముస్లిం మైనార్టీ అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, సంక్షేమ పథకాల్లో అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ముస్లింలకు న్యాయం చేయాలని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

బోయలగూడెంలో బీమా నమోదు

గట్టు: మండలంలోని బోయలగూడెం గ్రామంలో శనివారం ఉచిత బీమా నమోదు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచ్ రాణిలు ప్రారంభించారు. ఆరోగ్యబీమాను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో సీఎస్‌సీ డైరెక్టర్ నర్సింహులు, రామాంజనేయులు, ఖాశీం, భీమేష్, లక్ష్మణ్, వెంకట్రామిరెడ్డి, మూకన్న, కృష్ణ, వీరేష్, తిమ్మన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

పెబ్బేరు రూరల్: పట్టణానికి చెందిన ఎంఐఎం మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ యువసేన ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అఫ్రోజ్ పుట్టినరోజు సందర్భంగా 30మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జాకీర్, ఆరిఫ్, మస్తాన్, సమీర్, మొహమ్మద్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలి రేట్లను సవరించండి

అమరచింత: వ్యవసాయ కూలి రేట్లను సవరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అజయ్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1948 చట్టం ప్రకారం వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల జీఓను సవరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రజలు కొనలేని, తినలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మహేందర్, బెక్కం విష్ణు, రమేష్, లక్ష్మణ్, దిలీప్, హన్మంతు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆత్మకూర్: మండలంలోని మూలమల్లకు చెందిన బండలయ్య–సువర్ణ కుమారుడు ప్రశాంత్, కురుమూర్తి–లలిత కూతురు రోషిణి నీట్‌లో సత్తా చాటి ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మూలమల్ల అంబేద్కర్ సంఘం నాయకులు విద్యార్థులను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మన్యం, బాలకిష్టన్న, సుధాకర్, రాజు, దేవదా సు, శ్రీను, సురేష్, వెంకటన్న పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సత్వర న్యాయం

- అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి ప్రభాకర్



అలంపూర్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి ప్రభాకర్

అలంపూర్ రూరల్: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి ప్రభాకర్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి కమాలపురం కవిత ఆధ్యక్షతన లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన తగాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ అపరాద రుసుంగా రూ.17,51,880 కోర్టుకు సమకూరినట్లు జడ్జి కమాలపురం కవిత తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ ఇన్‌చార్జ్ సాయితేజ, ప్యానల్ న్యాయవాది గజేంద్రగౌడ్, న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌కుమార్, తిమ్మారెడ్డి, రాజేశ్వరి, కిషన్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలాక్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, అమరవాయి వీరభద్రస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, మల్దకల్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ, దీరేంద్రదాసు, వాల్మీకీ, పూజారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మానవపాడు: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమేలమ్మ తెలిపారు. శనివారం మండలకేంద్రంలో అంగన్‌వాడీల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 11 నుంచి జరిగే నిరవధిక సమ్మె జయప్రదం చేయాలని ఆమె పేర్కొన్నారు. జూలై 18న మంత్రి అంగన్‌వాడీ టీచర్లతో చర్చలు నిర్వహించినా ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు అరంజ్యోతి, శాంతమ్మ, ఆదిలక్ష్మి, సుమిత్ర, సలోమి, ఫరీదాబేగం, లక్ష్మీకాంతమ్మ, ఈశ్వరమ్మ, నరసింహ, మాలిక్‌బాషా, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గద్వాల అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రం రాజీవ్‌మార్గ్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేపట్టిన సమ్మె శనివారంతో 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు, నర్సింహులు, పరుశరామ్, నాగర్జున, పుష్ప, సుజాత తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న వెంకట్‌రెడ్డి

కేటీదొడ్డి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో యువతీ యువకులు పాత్ర చాలా ముఖ్యమని ఎంవీ ఫౌండేషన్ నేషనల్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై గట్టు, కేటీదొడ్డి ఎంవీఎఫ్ కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడికి దూరమైన చిన్నారులకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు ఎంవీఎఫ్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. బడిబయట పిల్లలను సర్కార్ బడిలో చేర్పించే బాధ్యతతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకటేష్, వీవీ రావు, సాయికుమార్, సదానందం, జయరామ్ ఉన్నారు.

'సమగ్ర శిక్ష' కాంట్రాక్టు ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



దీక్ష శిబిరంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో సమగ్ర శిక్ష కింద 20ఏళ్లుగా శ్రమదోపిడికి గురవుతున్న తమను తక్షణం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష శనివారం ఐదో రోజుకు చేరింది. పీఆర్‌టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, టీపీయూ, బీసీటీఏ, టీపీఆర్‌టీయూ, పీఈటీ అసోసియేషన్, బ్యాక్వర్డు మైనార్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తదితర సంఘాల నాయకులు వేర్వేరుగా సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. అనంతరం అర్ధనగ్న ప్రదర్శనతో వినూత్నంగా నిరసన తెలిపారు. బిక్షటన నిర్వహించి, సంతకాల సేకరణ చేపట్టారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగినులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామాంజనేయులు, యువరాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.